
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 9 మార్చి 2025



స్ఫూర్తిదాయకం బాలానందన్ జీవితం : సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - తిరుపతి సిటి



సిఐటియు వ్యవస్థాపక నాయకులు, మాజీ జాతీయ అధ్యక్షులు ఈ.బాలానందన్ జీవితం స్ఫూర్తిదాయకమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. ఆయన స్ఫూర్తితో కార్మికవర్గం మరింత చైతన్యవంతమైన పాత్రను రాష్ట్రంలో పోషించాలని, కార్మిక సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. బాలానందన్ శతజయంతి పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఈ బాలానందన్ ఐక్యరాజ్యసమితిలో ప్రపంచ దిగ్గజాలతో వివిధ సమస్యలపై చర్చలు జరిపి, భారతదేశ ప్రతినిధిగా ప్రాతినిధ్యం వహించిన ఘటనలను ఆయన ఉదహరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఓబులు, అజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పాల్గొన్నారు.

నాలుగు రెట్లు అదనంగా విద్యుత్ బిల్లులు

సిపిఎం ప్రజా చైతన్య యాత్ర దృష్టికి...

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'కూటమి' హయాంలో నాలుగు రెట్లు అదనంగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయని వినియోగదారులు సిపిఎం ప్రజా చైతన్య యాత్ర దృష్టికి తెచ్చారు. శనివారం మహిళా దినోత్సవం పురస్కరించుకుని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎవి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సుందరయ్యనగర్ శాఖా సభ్యులు ఆ ప్రాంతంలో ఇల్లిల్లు తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8-17 తేదీల్లో ప్రజా చైతన్య యాత్రలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దోబీఘాట్ వృత్తిదారుల సమస్యలు తెలుసుకున్నారు. దోబీఘాట్ పక్కనే చెత్తను వేయడం వల్ల దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. విద్యుత్ తీగల సబ్‌స్టేషన్ ఉండడంతో ప్రమాదంగా ఉందన్నారు. విద్యుత్ బిల్లులు నాలుగు రెట్లు అధికంగా వస్తున్నాయన్నారు. నిజమైన లబ్ధిదారులకు పక్షపాతం వచ్చినా పింఛన్ ఇవ్వని దుస్థితి ఉందని, కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదన్నారు. బిసి కార్పొరేషన్ నుంచి వాషింగ్ మిషన్లు, ఐరన్‌బాక్సులు సబ్సిడీపై రుణాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా ఎవి నాగేశ్వరరావు, వందవాసి నాగరాజు మాట్లాడుతూ 17వ తేదీ వరకు ప్రజా సమస్యలు తెలుసుకుని, 22-28 తేదీల్లో ఆయా సచివాలయాల్లో అర్జీలను ఇప్పిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కె వేణుగోపాల్, సిపిఎం జిల్లా నేతలు టి సుబ్రహ్మణ్యం, ఎస్ జయచంద్ర, పి సాయి లక్ష్మి, యస్ మాధవ్, రవి, ఎం నరేంద్ర, పి బుజ్జి, ఎం జయంతి, పి రమేష్, ఆర్ మల్లికార్జునరావు, రామకృష్ణ, బాలాజీ, ఎండి శ్రీనివాసులు పాల్గొన్నారు.



సిపిఎం నాయకులకు దోబీఘాట్ సమస్యలను వివరిస్తూ..

'రాజీ' లోక్‌అదాలత్‌లో సాధ్యం

భార్యాభర్తలను కలిపేశారు

ప్రజాశక్తి - గూడూరు టౌన్, పుత్తూరు టౌన్

కోర్టులో ఉన్న కేసులను తగ్గించి, ప్రజలకు తొందరగా న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో జాతీయ లోక్ అదాలత్‌ను రూపొందించామని ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం అన్నారు. కక్షిదారులు తమ విలువైన సమయాన్ని కోర్టుల చుట్టూ తిరుగుతూ వృథా చేసుకోరాదని సూచించారు. గూడూరు రెండో పట్టణ కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్, మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ రాజీపడి కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బి.రాజేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బివి.సులోచన రాణి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పి.శంకరయ్య, ఏపీపీ లక్ష్మీనారాయణ, బార్ అధ్యక్షుడు భాస్కరరావు పాల్గొన్నారు.



పుత్తూరులో...

భార్యాభర్తలను కలిపారు

పుత్తూరు పట్టణంలోని కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ శనివారం జరిగింది. కల్యాణపురం గ్రామానికి చెందిన వై.గురుచందన్, ఎన్జీవో కాలనీకి చెందిన కె.పద్మప్రియ ఇద్దరూ మనస్పర్ధలతో విడిపోవాలని, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర, న్యాయవాదుల సమోంలో రాజీ చేసి, భార్యాభర్తలను ఒక్కటి చేశారు. కోర్టు ఆవరణలోనే వారిద్దరికీ పూలదండలు మార్పించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ భార్యాభర్తలు ఐకమత్యంతో ఒకరి మనస్సు ఒకరు తెలుసుకుని సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. వారిరువురిని ఒక్కటి చేయడానికి సహకరించిన బివి చలపతి, ఎం.సంజీవిలకు కృతజ్ఞతలు తెలిపారు.



గూడూరులో సీనియర్ సివిల్ జడ్జి

మహిళా దినోత్సవ పోరాట స్ఫూర్తి

కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల దీక్ష

కళ్లకు గంతలతో వినూత్న నిరసన



దీక్షా శిబిరం వద్దనే వెటర్నరీ విద్యార్థుల వినూత్న నిరసన

'న్యాయం' కావాలి

ప్రజాశక్తి - క్యాంపస్

'న్యాయం కావాలి' అంటూ వెటర్నరీ వైద్య విద్యార్థులు దీక్షలు కొనసాగిస్తూనే శిబిరంలో మహిళా దినోత్సవాన్ని పోరాట స్ఫూర్తితో నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయంలో ఉపకార వేతనాలు ఇతర వైద్య విద్య కోర్సులతో సమానంగా తమకు స్టైఫండ్ పెంచాలని కోరుతూ చేస్తున్న నిరసన దీక్షలు శనివారం 34వ రోజుకు చేరుకున్నాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పశువైద్య విద్యార్థులు నల్ల వస్త్రాలు ధరించి కళ్ళకి గంతలు కట్టుకొని 'మహిళలకు న్యాయం జరగలేదు' అనే విధంగా, ముఖ్యంగా పశువైద్య విద్యార్థులకు ఉపకార వేతనాలు పెంచాలని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అయినప్పటికీ పశు వైద్య కళాశాల మహిళా విద్యార్థులు నల్ల దుస్తులు ధరించి, నల్ల మాస్కులు ధరించి వినూత్నంగా మహిళా దినోత్సవం జరుపుకోవట్లేదని ఇంతమంది మహిళా విద్యార్థినిలు ఎండలో కూర్చుని ఇన్ని రోజులుగా సమ్మె నిర్వహిస్తుంటే ఏ ఒక్క అధికారి నుంచి స్పష్టమైన హామీ లేకపోవడం చాలా బాధాకరమని స్పష్టం చేశారు. జి ఎస్ ఆర్ మాగ్నెట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఐదవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో పశువైద్య విద్యార్థులకు ఆ సంస్థలో చదివే పిల్లల యొక్క తల్లిదండ్రుల సహకారం కావాలని పశువైద్య విద్యార్థులు విన్నవించారు. వెటర్నరీ విద్యార్థులు దేశం కోసం పనిచేస్తున్నారని, కానీ వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ఈ పోరాటం న్యాయం సాధించేదాకా ఆగదని స్పష్టం చేశారు. వెటర్నరీ విద్యార్థుల ఆవేదన సమాజం వినాలని, బాధ్యత వహించాల్సిన వారు స్పందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య కళాశాల విద్యార్థులు నీలిమ, ప్రవీణ, పురుషోత్తం, యుగంధర్, పవన్ పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా 'మహిళా' సంబరం (వార్తలు 6లో)

ఆ ఒక్కరోజే 'ఆమె'కు పట్టం

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

కార్యేషు దాసి, కరణేషు మంత్రి, భోజ్యేషు మాతా, శయనేషు రంభ.. మగవారికి మహిళా అవసరం గురించి ఓ సినీ కవి చెప్పిన స'నూ'తన వాస్తవం. సృష్టికి మూలం స్త్రీ... ఇంటికి వెలుగు ఇల్లాలు... తల్లే తొలి దైవం..ఇవి వాస్తవాలు. వీటిని నిత్యం వల్లెవేసే వారు ఆచరించడంలో మాత్రం వెనుకంజ వేస్తారు. పురుషఅహంకార సమాజంలో ఆడవారిని ఆటబొమ్మగానే చేస్తున్నారు. మనుస్మృతి రాజ్యమేలుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలను మనిషిగా చూడటం గగనమవుతోంది. కానీ ఆ ఒక్క రోజు మాత్రం 'అమె'కు పట్టం కడతారు. అదే అంతర్జాతీయ మహిళా దినోత్సవం. మగువలకు మించిన వారు లేరని పొగడ్తలతో ముంచేస్తారు. రెండు మూడు రోజుల పాటు హడావిడి చేసేస్తారు. ఆపై షరామామూలే. ఆడదంటే వంటింటి కుందేళుగానే పరిగణిస్తారు. ఇదే తల్లిగా, చెల్లిగా, అక్కగా, స్నేహితురాలుగా, సహచారిణి (ఆర్ధాంగి)గా జీవితాంతం తోడుండే ఆడవారికి సమాజం ఇచ్చే గౌరవం...?

మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం. రష్యన్ విప్లవంలో మహిళల పాత్రను గౌరవించడానికి వ్లాదిమిర్ లెనిన్ 1922లో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించారు. కమ్యూనిస్ట్ దేశాలు ఆ తేదిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. 1977లో ఐక్యరాజ్యసమితి దీనిని అధికారికంగా ప్రకటించింది. కమ్యూనిస్టుల మూలాన కనీసం ఏడాదికి ఒక్కసారైన స్త్రీని అదికారికంగా గౌరవించుకునే అవకాశం రావడం గమనార్హం. 2025 మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం రానే వచ్చింది. దశాబ్దాల తరబడి మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటూనే ఉన్నాం. ప్రతి ఏడాదీ పాలకులు, అధికారులు మహిళలకు అది చేస్తాం, ఇది చేస్తాం అంటూ హామీలు ఇవ్వడం, ఊకదంపుడు ప్రసంగాలు చేయడం తప్ప చేతల్లో శూన్యం. ఏడాదికి ఏడాది పాలకులు, అధికారులు, పార్టీలు మారుతాయే తప్ప మహిళాల జీవితాల్లో మార్పు మాత్రం రావడం లేదు. జిల్లా వ్యాప్తంగా మూడు రోజులు ముందు నుంచే ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, కంపెనీలు, అన్నింటా మహిళా దినోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. మహిళా దినోత్సవం ముందు రోజు తిరుపతి కేంద్రంగా టిటిడి, ఎస్‌విఎంసి, ఎపిఎన్‌జీవోలు, ఐద్వా, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, శ్రీపద్మావతి మహిళా మండలి, వివిద సంఘాల ద్వారా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు, ఆడవారికి క్రీడా పోటీలు జరిపారు. కొంత మంది మహిళలకు అవార్డులు ప్రదానం చేశారు. మరికొంత మంది సత్కారం చేశారు. మహిళా దినోత్సవం రోజు అధికారికంగా జిల్లా కలెక్టర్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిపి మహిళలను సత్కరించారు. కొన్ని కార్యాలయాల్లో మహిళలకు సెలువు ప్రకటించారు. ఇవన్నీ పురుషుల పెత్తనంలోనే జరగడం గమనార్హం. మహిళలు కోరుకునేది సత్కారాలు, అవార్డులు కాదు. సాటి మనిషిగా గౌరవం. మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలను అరికట్టడం, తాము పురుషులకు ఏ మాత్రం తీసిపోమని, తమ ప్రతిభను గుర్తించి, తమకు అవకాశాలు ఇవ్వాలని, స్వతంత్రంగా జీవించేలా సహరించాలని కోరుతారు. ఆ దిశగా పాలకులు, చర్యలు తీసుకుని, మాటలకే పరిమితమవుతున్న మహిళా సాధికారితను సాధించేలా చేయాలని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు కోరుతున్నారు.

ఓటేరు భూకబ్జాదారులపై 'రెవెన్యూ' సానుభూతి



ప్రభుత్వ బోర్డు పీకేశారు

వామపక్షాల పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి రూరల్ మండలం ఓటేరు చెరువును మూడు రోజుల క్రితం భూకబ్జాదారులు జేసీబీలు, టిప్పర్లతో మట్టిని తెచ్చి పూడ్చివేసిన వారిపై చర్యలు తీసుకోలేదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డును సైతం తొలగించిన వారిని ఎందుకు అరెస్టు చేయలేదని వామపక్ష, రైతుసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు ఓటేరు చెరువులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డులను సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు పి.మురళి, వందవాసి నాగరాజు, రైతుసంఘం నాయకులు మాగంటి గోపాల్‌రెడ్డి, ఆర్‌పిఐ అధ్యక్షులు అంజయ్య పరిశీలించారు. వామపక్షాల ఆందోళనతో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి అని బోర్డు నాటారని, అయితే దాన్ని విరిచేసి అర్ధరాత్రిలో మరలా మట్టి తోలడానికి ప్రయత్నం చేశారన్నారు. భూకబ్జాదారుల పట్ల రెవెన్యూ అదికారులు, కలెక్టర్ ఎందుకింత సానుభూతి చూపిస్తున్నారన్నారు. శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌సివి నాయుడు ప్రత్యక్షంగా ప్రెస్‌మీట్ పెట్టి తమ భూముల్లో తామే మట్టి తోలామని చెప్పినా, ఇంతవరకూ ఎలాంటి కేసులు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ప్రత్యక్షంగా అసెంబ్లీలో శ్రీకాళహస్తి ఎంఎల్‌ఎ బొజ్జల సుధీర్‌రెడ్డి ఓటేరు చెరువును కాపాడాలని కోరినా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఓటేరు చెరువును కలెక్టర్ పరిరక్షించకపోతే ప్రజలందరినీ చైతన్యవంతం చేసి ప్రజా పోరాటాల ద్వారా చెరువును కాపాడుకుంటామని హెచ్చరించారు.

చర్య తీసుకోకపోతే ఆమరణ దీక్ష : జనసేన

పర్యావరణాన్ని పరిరక్షించడం జనసేన సిద్ధాంతమని, తిరుపతి రూరల్ మండలంలో 36 ఎకరాలు ఓటేరు చెరువు కబ్జాకు గురయ్యిందని, మూడు రోజుల్లో రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోని పక్షంలో ఆమరణ దీక్ష చేస్తామని జనసేన చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవర మనోహర్ హెచ్చరించారు. శనివారం ఓటేరు చెరువు కబ్జాను జనసేన కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. బ్రిటీష్ ప్రభుత్వానికి ముందు నుంచి ఉన్న చెరువు అన్యాక్రాంతం అవుతుంటే రెవెన్యూ, పోలీసు శాఖలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న చెరువును మట్టితో పూడ్చివేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారన్నారు. చెరువును చెరువుగా ఉంచాలని, సెక్యూరిటీ ఏర్పాటు చేసి పహారా చేపట్టి, అక్రమార్కులను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు.



ఓటేరు చెరువును సందర్శించిన జనసేన నేతలు

నకిలీ పు(ర)చ్చ

అన్నదాతలు లబోదిబో
శ్రీకాళహస్తిలో 'కాయ'ని తోటలు

తూర్పున 'భిన్న' సాగు

ఒకే జిల్లా.. పక్కపక్క నియోజకవర్గాలు.. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పుచ్చ సాగు నష్టాలను చవి చూస్తుంటే, సత్యవేడు నియోజకవర్గంలో లాభదాయకంగా ఉంది.. మార్కెట్లో ధర ఓ రకంగా గిట్టుబాటు అవుతున్నా శ్రీకాళహస్తిలో రైతుల తోటల్లో కాయలు లేక మోడుబారి ఉన్నాయి. సత్యవేడు నియోజకవర్గంలో తోటలు కాయలతో కళకళలాడుతున్నాయి. అదేమని ఉద్యానవన శాఖ అధికారులను శ్రీకాళహస్తి సాగు రైతులు అడిగితే వాతావరణంపైనా, నాశిరకం మందులపైనా తోసేస్తుండటం గమనార్హం.



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

నకిలీ విత్తనాలతో పుచ్చ తోటలు నేడు మోడై దర్శనమిస్తున్నాయి. వాతావరణ ప్రభావమో..! లేకుంటే నకిలీ విత్తనాల వలనో... రోజులు గడిచి పోతున్నా పుచ్చ తోటలు కాపుకురాని పరిస్థితి. ఇన్నాళ్ళూ పుచ్చ సాగులో లాభాల సిరులు చూసిన రైతన్నలు ఈ'సారి'కి నష్టాల దెబ్బ చవి చూడాల్సి వస్తుందేమోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ పంటలు మాని వాణిజ్య పంటల వైపు దష్టి సారిస్తున్న రైతులకు ఇది చేదు నిజమనే చెప్పాలి. వాతావరణ ప్రతికూలత, విపరీతమైన పురుగు మందులు, కత్రిమ ఎరువుల వాడకం ఈ దుస్థితికి కారణమని వ్యవసాయ అధికారులు చెబుతుండటం గమనార్హం.

మోడుగా పుచ్చతోటలు

తూర్పు మండలాలు సాధారణ పంటలతో పాటు వాణిజ్య పంటలకు సైతం అనువుగా ఉన్నాయి. దీంతో సాధారణ పంటల్లో నష్టాల పాలైన రైతన్నలు గడిచిన పదేళ్లుగా వాణిజ్య పంటల సాగుపై ఎక్కువగా దష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా పుచ్చ, దోసకాయ సాగు విస్తారంగా ఉంది. తూర్పు మండలాల రైతులు రబీలో సుమారు 2 వేల ఎకరాల్లో పుచ్చ సాగు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే పంట చేతికొచ్చే దశకు చేరుకుంటున్నా తోటలు మోడై కనిపిస్తుండడంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. సాధారణంగా పుచ్చ తోటలు విత్తు నాటిన రోజు నుంచి నలభై రోజులకు పిందె దశకు చేరుకుంటాయి. 65 రోజుల నుంచి 75 రోజుల మధ్య పక్వ దశకు చేరి కోతకు వస్తాయి. అయితే ఈ సారి 50 రోజులు దాటి పోతున్నా పిందె కానరాని పరిస్థితి. 60 నుంచి 70 రోజులు దాటిన తోటల్లో అర కొర కాయలతో మోడుగా దర్శనమిస్తున్నాయి. సత్యవేడు నియోజకవర్గంలో పుచ్చ సాగు కాస్త భిన్నంగా ఉన్నా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మాత్రం అధ్వానంగా ఉందని రైతులు వాపోతున్నారు. కోత కోయాల్సిన సమయంలో పిందెలెప్పుడొస్తాయోనని ఎదురు చూస్తుంటే గుండె తరుక్కుపోతోందంటూ రైతులు వాపోతున్నారు. ఎందరి సలహాలు తీసుకున్నా, ఎన్ని మందులు వాడినా తోటలు బలుస్తున్నాయే తప్పా కాయ కానరావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు భలే ఖరీదు

పుచ్చ, దోస సాగు బాగా ఖర్చుతో కూడుకున్నది. పుచ్చకు ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి అవుతుండగా, దోసకు రూ.50 వేలు అదనం. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కోతకు వచ్చే ఈ పంటలకు యాజమాన్య చర్యలు చేపట్టడం కూడా కష్టతరమే. గింజ నాటిన రోజు నుంచి కాయ కోసే వరకు పురుగు మందులు క్రమం తప్పకుండా పిచికారీ చేస్తూనే ఉండాలి. తీగ, కాయ ఎదుగుదలకు డ్రిప్‌ల ద్వారా పోషకాలను సరఫరా చేస్తూనే ఉండాలి. ఇలా పుచ్చ, దోస సాగు ఖర్చే కాదు, శ్రమతో కూడుకున్నది. ఇంతటి వ్యయప్రయాసలకోర్చి మండుటేసవిలో మన కడుపులు సల్లంగా ఉంచుతున్న రైతన్నలకు నష్టాలు, గిట్టుబాటు లేని ధరలు కడుపుమంటనే మిగులుస్తున్నాయి.

అందరిదీ నష్టాల బాటే: గంగయ్య, పుచ్చ రైతు, బోనుపల్లి


గతేడాది ఒక్కో ఎకరానికి రూ.2 లక్షల చొప్పున లాభాలు చూసాం. ఈ 'సారి' పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కోత సమయానికి కూడా కాయలు దిగకపోవడంతో ఎరువులు, పురుగు మందుల కోసం అదనపు పెట్టుబడి పెట్టాం. అయినా ఫలితం శూన్యం. ఎకరాకు టన్ను కాయలు వచ్చినా గొప్పే అనిపిస్తోంది. ఈ సారి అందరిదీ నష్టాల బాటే. ప్రభుత్వం పుచ్చ రైతులను ఆదుకోవాలి. లేకుంటే ఆత్మహత్యలే శరణ్యం.

పురుగుమందుల వాడకం కొంప ముంచింది

పుష్పలత, ఉద్యానవన శాఖాధికారి, శ్రీకాళహస్తి

కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలన్నట్లు ఈ సారి పుచ్చలో అధిక దిగుబడులు రాకపోవడానికి అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడకమే కారణం. ఆ ప్రభావం వల్ల తోటలపై మిత్ర పురుగుల రాక తగ్గిపోయింది. ఫలితంగా ఫలదీకరణ సరిగా జరగక ఫ్రూట్ సెట్టింగ్ జరగలేదు. దానితో పాటు వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారాయి.





'మల్చింగ్' పుచ్చ 'మెచ్చే'న

అన్నదాతకు లాభదాయకం
కెవిబిపురంలో సాగు 'భళా'

ప్రజాశక్తి - కెవిబిపురం

ఈ ఏడాది సత్యవేడు నియోజకవర్గంలో పుచ్చ సాగు భళా అన్నట్లుగా ఉంది.. రైతులు ఈ ఏడాది పుచ్చ సాగు వైపు మొగ్గుచూపారు. ఆశించిన స్థాయిలోనే పంట దిగుబడి రావడం, మరోవైపు గిట్టుబాటు ధర ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కెవిబిపురం మండలంలో ఎన్నడూ లేని విధంగా పుచ్చ సాగు చేశారు. దీనికితోడు ఉద్యానవన శాఖ అధికారుల సాయం తోడవడంతో రైతులు ఆశించిన మేర దిగుబడి పొందుతున్నారు. ముఖ్యంగా బక్కపోతులగుంట, కల్లూరు, బ్రాహ్మణపల్లి, సూరమల, ఆదరం, కాళంగి, రంగయ్యగుంట, అంగెరి చెరువు గ్రామాల్లో పుచ్చ పంటను రైతులు సాగు చేశారు.

మల్చింగ్‌తో కలుపు తక్కువ

ప్రధానంగా మల్చింగ్ విధానంలో పండ్ల తోటలు సాగు చేస్తే చాలావరకు పెట్టుబడి తగ్గుతుంది. ఆ దిశగా పుచ్చ పంటకు బాగుంటుందని రైతులు చెబుతున్నారు. ప్రధానంగా విత్తనం వేసిన తరువాత కలుపు మొక్కలు ఏపుగా పెరుగుతాయి. కూలీలతో కలుపు మొక్కలు తీయించాలి. అయితే మల్చింగ్ విధానంలో పంట సాగు చేయడం వల్ల కలుపు మొక్కలు తొలగించే పరిస్థితి నుండి రైతులకు విముక్తి లభించింది అంతేకాక పురుగు మందుల పిచికరి కూడా తక్కువ మోతాదులో వినియోగించవచ్చు. తక్కువ మంది కూలీలతో పంట సాగు పూర్తి చేయొచ్చు. దీంతో రైతులు మల్చింగ్ విధానంలో సాగుకే మొగ్గు చూస్తున్నట్లు సమాచారం.

ఎకరాకు 15 టన్నులపైగా దిగుబడి

పుచ్చ పంట సాగులో ఎకరా పంటకు 15 టన్నుల పైగా దిగుబడి వస్తుంది. టన్ను రూ.10 వేలు నుంచి రూ. 13 వేలు వరకు ధర పలకడంతో ఈ ఏడాది రైతులు పుచ్చ పంట సాగులో ఆదాయం పొందామని రైతులు చెబుతున్నారు. కాయ నాణ్యతను బట్టి ధర ఉంది. ప్రస్తుత వేసవికి పుచ్చకాయలకు మార్కెట్లో మంచి ధర పలకడంతో వ్యాపారులు పొలాల వద్దకే వెళ్లి కొంటున్నారు.

550 ఎకరాల్లో పుచ్చ సాగు

ఈ ఏడాది పుచ్చ పంట సాగులో రైతులు సాంకేతికతను అందిపుచ్చుకున్నారు. కే వి బి పురం మండలంలో మొత్తం 550 ఎకరాల్లో ఈ ఏడాది పుచ్చ పంట సాగు చేశారు. అయితే ప్రధానంగా మల్చింగ్ డ్రిప్ పద్ధతిలో సాగు చేశారు. పాలథిన్ షీట్లను భూమిపై కప్పి పంటకు సాగు చేసే విధానాన్ని మల్చింగ్ అంటారు. పంటకు నీటి సరఫరా కోసం డ్రిప్ పద్ధతిలో తుంపర్ల ద్వారా సాగునీరు అందే విధంగా రైతులు సిద్ధం చేసుకున్నారు. సబ్సిడీపై షీట్లు, డ్రిప్ పైపులు అందుబాటులోకి రావడంతో ఈ పద్ధతి వైపు రైతులు ముగ్గు చూపిస్తున్నట్లు సమాచారం.

రైతుల్లో ఆసక్తి పెరిగింది : రాధారాణి, ఉద్యానవన శాఖ ఎఒ

పుచ్చ పంటను మల్చింగ్ విధానంలో సాగు చేసేందుకు రైతులు ఈ ఏడాది ప్రత్యేకంగా ఆసక్తి చూపారు. ఆ దశగా సత్యవేడు నియోజకవర్గంలోనే అత్యధికంగా కే వి బి పురం మండలంలో 550 ఎకరాలలో మాల్చింగ్ విధానం ద్వారా ఈ ఏడాది పుచ్చ పంటను సాగు చేశారు.ఈ విధానంలో దిగుబడి ఎక్కువ రావడంతో పాటు పెట్టుబడులు కూడా 40 శాతం వరకు తగ్గాయి. హెక్టరుకు రూ.16 వేలు సబ్సిడీ అందజేశాం. క్షేత్రస్థాయిలో రైతుల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నాం.



మల్చింగ్ విధానంలో సాగు

కులమతాలకు అతీతంగా..

3-5 తేదీల్లో 'ఉరుసు'

తొమ్మిదేళ్ల తరువాత నిర్ణయం

ప్రజాశక్తి - నాయుడుపేట

పట్టణంలో కులమతాలకు అతీతంగా పట్టణంలోని హిందూ ముస్లింలు ఏకతాటిపైకి వచ్చి ఏకాభిప్రాయంతో ఏప్రిల్ 3-5 తేదీల్లో 'ఉరుసు' ఉత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. దాదాపు 55 ఏళ్ల నుంచి జరుపుతున్నప్పటికీ అనివార్య కారణాల వల్ల ఎనిమిదేళ్ల క్రితం నిలిచిపోయిన 'హజరత్ షాహావలి దర్గా గంధమహోత్సవం ఉరుసు' కార్యక్రమాన్ని ఈ ఏడాది నిర్వహించనున్నామని సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంపి నెలవల సుబ్రమణ్యం చెప్పారు. ఉరుసు కార్యక్రమాన్ని జరుపుకునేందుకు నాయుడుపేట పట్టణ అఖిలపక్ష నాయకుల సమక్షంలో హిందూ ముస్లింల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌లో బహిరంగంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ఎస్‌కె రఫీ అధ్యక్షత వహించారు. హిందూ ముస్లింలు వారి వారి అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమం ఇన్ని సంవత్సరాలుగా ఆగిపోవడానికి కారణాలను వివాదాలకు తావు లేకుండా మాట్లాడారు. ఇప్పటివరకూ మనలో ఎన్నడూ ముస్లిం హిందువు అనే పదాలు వినిపించలేదని, అలాంటి మన మధ్య ఇలాంటి బేధాభిప్రాయాలు రావడం బాధాకరమని, ఉరుసును కులమతాలకు అతీతంగా నిర్వహించాలన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాఘవేంద్ర ట్రేడర్స్ సురేష్ శెట్టి, టిడిపి నాయకులు శిరసనం భేటి విజయభాస్కర్‌రెడ్డి, నెలవల రాజేష్, వైసిపి నాయకులు కామిరెడ్డి, రాజారెడ్డి, బిజెపి నాయకులు రంగినేని కిష్టయ్య,జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్ పాల్గొన్నారు.



వాడ వాడలా ఘనంగా మహిళా దినోత్సవం



తుడా వైస్ ఛైర్మన్ మౌర్యకు అభినందనలు తెలియజేస్తున్న తుడా కార్యదర్శి వెంకట నారాయణ, ఇంజనీరింగ్ సూపర్డెంట్ కృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్రయ్య

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రతి మహిళ విద్యావంతురాలు కావాలని అప్పుడే ఆ కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుంది సాధ్యమవుతుందని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అన్నారు. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో కమిషనర్ మౌర్య ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకట నారాయణ సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, సి.పి.ఓ. దేవకుమారి, ఈఈ రవీంద్ర, ఎల్.ఏ.ఓ.సుజన, ఉద్యానవన శాఖాధికారి మాలతి, మేఘన, గాయత్రి, హరిణి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు సిఐటియు ఐద్వా ఆధ్వర్యంలో వేమన విజ్ఞాన కేంద్రంలో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామీణ మహిళా జిల్లా కన్వీనర్ ఆర్ లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రోజా రమణి, ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి సాయి లక్ష్మి, సోనిక తగే, అడ్వకేట్ ఏ వర్షిణి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి బుజ్జి, హాకర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం జయంతి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వాణిశ్రీ, అడ్వకేట్ శ్రీదేవి, కార్పొరేటర్ లక్ష్మి, ఆశా వర్కర్స్, జిల్లా కార్యదర్శి కందారపు మురళి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ఆర్థిక పురోగతి సాధించేలా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం స్థానిక తిరుపతి పట్టణంలోని కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళాదినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ నేడు మహిళా చైతన్యాన్ని పెంపొందించేలా ప్రపంచవ్యాప్తంగా మహిళా దినోత్సవ జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం నగరపాలక కమిషనర్ మౌర్య మాట్లాడుతూ మహిళా సాధికారతకోసం ఎందరో కృషి చేశారని తెలిపారు. బి.సి కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి డిప్యూటీ మేయర్లు ముద్రగడ నారాయణ, ఆర్సి మునికృష్ణ కార్యక్రమం అనంతరం ప్రతిభ కనబరిచిన మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డిఓ కిరణ్మయి, అడిషనల్ ఎస్పీ లా అండ్ ఆర్డర్ రవి మనోహర్ ఆచారి, డి.ఎస్.పి శ్రీలత, మాజీ ఎం.ఎల్.ఏ సుగుణమ్మ, ఐసిడిఎస్ పిడి వసంత బాయి, డి ఆర్ డి ఏ పి డి శోభన్ బాబు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి లోకనాథం, మహిళా సంఘాలు, సిడిపిఓ లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి కరకంబాడి, వినాయకసాగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకింగ్ కు వచ్చే సుమారు 100 మంది మహిళా వాకర్స్ సభ్యులను శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యాట్ క్రిష్ణ ప్రసాద్, వినాయకసాగర్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం రాజు, చంద్ర, రామస్వామి, రామసుబ్బారెడ్డి, నరసింహయ్య, వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్ శాంతి, పుష్పలత, సుజాత, అనూష, మోనిక, విజయలక్ష్మి, దేవిక తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత, భద్రత కోసం తమ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తిరుపతి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక యల్ ఐ సి రోడ్ లోని రాష్ట్ర ప్రభుత్వవిశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సంఘం తిరుపతి నగర శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు. జనసేన పార్టీ నాయకురాలు లాయర్ వనజ, విశ్రాంత ఉద్యోగుల సంఘం వైస్ ప్రెసిడెంట్ గోపాల్, ఆర్థిక కార్యదర్శి మునికృష్ణ, సంఘం జాయింట్ కార్యదర్శులు టీ.రమణ, టి.జయలక్ష్మి, మహిళా సభ్యులు భాగ్యలక్ష్మి రమణమ్మ, నవనీతమ్మ జయరాం, విశ్రాంత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కృష్ణ తేజ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ నందు కృష్ణ తేజ ఫార్మసీ కాలేజ్, సి కె ఎస్ తేజ డెంటల్ కాలేజీల్లో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైభవంగా వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విస్డం క్లబ్ తిరుపతి ప్రెసిడెంట్, ఉమ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తహసుని సాహిరాం, కృష్ణ తేజ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఎండి చైర్మన్ కృష్ణమూర్తి ఫ్యామిలీ, కృష్ణ తేజ ఫార్మసీ కాలేజ్ ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ సభ్యులు డాక్టర్ సారా బృందం, సికెఎస్ తేజ డెంటల్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శిరీష రావు ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్, డెంటల్ కాలేజ్ విద్యార్థులు, డాక్టర్లు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులతో సహపంక్తి భోజనం చేస్తున్న దృశ్యం

మహిళా దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని శానిటరీ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో జాతీయ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి, చెరుకు సుగుణవతి, ప్రగతి సంస్థ డైరెక్టర్ కె.వి.రమణలు శనివారం పారిశుద్ధ్య కార్మికులతో సామూహిక సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య ఇన్స్పెక్టర్ కార్యాలయం అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి శ్రీలత, మహిళా, పోలీస్ యూనిట్ వైద్యులు డాక్టర్ మాధురి, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్న స్వేచ్ఛను పొందాలన్న విద్యతోనే సాధ్యమవుతుందని వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని వేలూరు నరువి హాస్పిటల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నరువి హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ జీవి. సంపత్ కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ నర్సింగ్ మేనేజర్ అనంతి, నియోనాటాలజిస్ట్ డాక్టర్ అశ్విత, డాక్టర్ సర్వద, డెర్మటాలజిస్ట్ డాక్టర్ సుజాత, అసోసియేట్ మేనేజర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.



కళారాణితో శ్రీరామ కళాశాల మహిళా సిబ్బంది

శ్రీ రామ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ వి.కళారాణి హాజరై మహిళా సిబ్బంది, విద్యార్థినులకు ఉపయుక్తమైన అంశాలను తెలియచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జయచంద్ర మాట్లాడుతూ ఉన్నత స్థానాలలో ఉన్న మహిళలను కళాశాల విద్యార్థినిలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందకుమార్ రెడ్డి, కన్వీనర్ డాక్టర్ సృష్ణుదూజ, లలిత, చంద్రకళ, గ్రీష్మ, కళాశాల మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఏర్పేడు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పేడు మండలం కందాడు గ్రామంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఐడెంటి కార్డులు అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రంగయ్య, సిఐటియు సహాయక కార్యదర్శి రాంబాబు, రైతు సంఘం నాయకులు ధర్మారెడ్డి, నాగరాజు, జ్యోతమ్మ, శుభ రత్న తదితరులు పాల్గొన్నారు.

పాపానాయుడుపేట గ్రామ పంచాయతీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం సర్పంచ్ మేకతొట్ల లలిత కరుణాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కొందరు మహిళలను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి యం.హరికృష్ణ ఎంపీటీసీ కె. మునిరాజులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కృష్ణన్న మొదలి, అర్జున్ బాబు, రవి, సచివాలయం సిబ్బంది, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పాపానాయుడు పేటలోని, జడ్.పి.హై స్కూల్లో అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబేద్కర్ స్టార్ కృష్ణ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పదవ తరగతి విద్యార్థులకు ఆయన విద్యా సామగ్రి బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠ్యాయులు కుమార్ నాయుడు, రాజేంద్ర, ప్రహ్లద రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కోట: శనివారం కోట మండలం, విద్యానగర్, స్థానిక ఎన్బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ బి.వల్లీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కళాశాల మేనేజర్ రామకృష్ణ రెడ్డి పాల్గొన్నారు. ఉన్నతస్థాయిలో ఉన్న పదవుల్లో మహిళలను ఆదర్శంగా తీసుకుని సంఘంలో ఉత్తమమైన విజయాలను పొందాలని పలు సూచనలు, సలహాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.చంద్రశేఖర్ రెడ్డి, కళాశాల కో ఆర్డినేటర్ రాజేష్, డాక్టర్ గాది శ్రీనివాసులు, డాక్టర్ టి.వళ్ళీదేవి, సుజాత, రోహిణి, లక్ష్మి దివ్య, లత, లాలసలతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాయుడుపేట: మార్చి 8వ తేదీ శనివారం జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గం శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ నాయుడుపేటలో నిర్వహించిన పలు కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే విజయశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొనగా మున్సిపల్ కమిషనర్ ఫజీలుల్లా అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో విజయశ్రీ దంపతులకు, కటకం దీపిక దంపతులను సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్. రాజేశ్వరి, (ఐద్వా- మండల కార్యదర్శి) రేణిగుంట

ప్రజాశక్తి - రేణిగుంట : అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 వ తేదీ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో రేణిగుంట జి.యం వీధి లోని స్థానిక సిపిఎం పార్టీ పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి రాజేశ్వరి, అడ్వకేటర్ అరుణలు మాట్లాడుతూ మహిళలకోసం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా నిరంతరం పోరాటం చేస్తున్నదన్నారు. అనంతరం రేణిగుంట గౌరి నగర్, సంఘమిత్ర ఆఫీస్‌లో ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవంలో ఐద్వా నాయకురాలు సహజ, సిఐటియు నాయకులు హరినాథ్, జన విజ్ఞాన వేదిక కన్వీనర్ వెంకటరమణ, యుటిఎఫ్ నాయకులు సురేష్, ఐద్వా మండల కార్యదర్శి రాజేశ్వరి, అధ్యక్షురాలు లక్ష్మి, మనీలా, అడ్వకేటర్ అరుణ, బ్యూటీ పార్లర్ శిరీష, దివ్య, రాజి, ఈశ్వరమ్మ, భారతి, సహజ తదితర మహిళలు పాల్గొన్నారు.

రేణిగుంట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో చైర్మన్ యస్ ఆసన్ సాహెబ్, సెక్రటరి జి జయంత్ కుమార్, రేణిగుంట గ్రామ సర్పంచ్ నగేష్ , గ్రామ సచివాలయం సెక్రటరీ లలిత , రిటైర్డ్ రైల్వే నర్సింగ్ సూపర్డెంట్ నాగేంద్ర మణి, పద్మిని, సహాయ కార్యదర్శి పోసిన వెంకటేశ్వర్లు, మహిళ అసిస్టెంట్ సెక్రటరీలు జి రాజేంద్రప్రసాద్, వి రామమూర్తి, రవీంద్ర బాబు, టి శేషాద్రి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు కొమ్మక లక్ష్మీదేవిని మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ టిడిపి సోదరులు సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. జీవితాంతం ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో పార్టీ కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు.

మహిళా దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన మండలంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే నాని హాజరయ్యారు. సంఘ మిత్రలకు సన్మానం చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు మండల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి మహిళా నాయకులు ఎన్టీఆర్ విగ్రహంవద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాలు మట్టం శ్రావణి రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులు మహిళాభివృద్ధికి ఎంతో చేశాంన్నారు. ఈ కార్యక్రమంలో లీలావతి, శ్రీదేవి, భారతి కల్పన, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు బ్రాహ్మణ సేవా సంఘ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానిక ముఖ్యఅతిథిగా గూడూరు పట్టణ డీఎస్పీ గీతా కుమారి విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలు నేటి సమాజంలో అప్రమత్తంగా ఉండాలని సూచిన్చారు. ఈ కార్యక్రమానికి కమిటీ సంఘ అధ్యక్షులు అనిమెళ్ళ శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గూడూరు, కరణాల వీధిలో ఉంటున్న పారిశ్రామిక వేత్త పొనకా శివకుమార్ రెడ్డి నివాసానికి శనివారం గూడూరు ఆర్టీసీ డిపోకు చెందిన ఎన్.ఎం.యూ నాయకులు, మహిళలు చేరుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ రెడ్డి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ప్రవీణ్, కోశాధికారి గౌస్, ఉమా మహేశ్వరి, పార్వతి, శ్రీకళ, మంజుల, గీత తదితరులు పాల్గొన్నారు.

గూడూరు, శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గూడూరు డిఎస్పీ గీతకుమారి, ప్రముఖ డాక్టర్ రోహిణిలను కలిసి ఘనంగా సత్కరించి, మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, అకడమిక్ డీన్ శ్రీహరి, ఉపాధ్యాయులు రఫీ, మస్తాన్‌బీ, సుప్రజ, సుప్రియ, నసీర, సమ్రిన్, యామిని, రజిని, హరిత, ఉమ,జ్యోతి,ఝాన్సీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను గూడూరు షాదీ మందిర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు డిఎస్పీ గీతా కుమారి విచ్చేశారు. ఈ సందర్భగా డిఎస్పీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది పెంచలయ్య, కమ్యూనిటీ ఆర్గనైజేర్లు చందన, లత, ఉష, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీకృష్ణ సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ బి.శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) దాతృత్వంతో గూడూరు రెండవ పట్టణంలోని మినీ గురుకులంలో పని చేస్తున్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి వివిధ రకాల పోటీలు నిర్వహించారు. మినీ గురుకులం హెచ్ఎం మేరీ ప్రియత మయూరి శ్యామ్ యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మినీ గురుకులం హెచ్ఎం మేరీ ప్రియత, లావణ్య, లలిత, చంద్ర, నాగూరమ్మ , వనమ్మ, కల్పన, యన్ రమణమ్మ, పద్మ, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ బి.చంద్రమౌళి మహిళ ఉన్నతిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికార సంస్థ కన్వీనర్ డాక్టర్ కందేరి శ్రీదేవి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కోటేశ్వరయ్య, వి. వీరయ్య, డాక్టర్ ఆర్. బి. వాణిశ్రీ, డాక్టర్ ఏ.దేవకి, డాక్టర్ వి, వాసవి, డాక్టర్ సుజన, డాక్టర్ గాయత్రి, డాక్టర్ సుజల స్వప్న స్మిత, డాక్టర్ సావిత్రి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ వరలక్ష్మి, టి. నరసింహులు,శ్రీమతి గౌరీ, డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ హరిబాబు తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్ అధ్యక్షులు కే.లక్ష్మీనారాయణ మూర్తి, అసోసియేషన్ ఇంటర్నేషనల్ వాకర్ గవర్నర్ రావిళ్ళ మాధవ నాయుడుల ఆధ్వర్యంలో, శనివారం పుత్తూరు ఎస్‌హెచ్‌ఓలో మహిళా ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్. ఫౌండర్ డాక్టర్ శ్రీనివాసన్ రెడ్డి, సెక్రెటరీ, ఇంటర్నేషనల్ ట్రెజరర్ పి ఎస్. కృష్ణంరాజు, ఆరుముగం, గోపి కృష్ణ, నారాయణ, నరసింహులు, సీఐ ఎస్ఐలు మహిళ లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రతి మగువ ఒక తెగువ కావాలని ఐద్వా నాయకురాలు రాధమ్మ పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు ప్రవల్లిక, సెల్వి, సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, కుమార్, గురవయ్య, గురునాధం తదితరులు పాల్గొన్నారు.

జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి కోటా వినుత ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పారిశుధ్య విభాగంలో సేవలందిస్తున్న మహిళా కార్మికులకు వినుత చీరలు పంపిణీ చేశారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సందర్భంగా శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలో 40 మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎస్ నాయుడు, జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, రాష్ట్ర కోశాధికారి సునీల, జిలా కార్యదర్శి విజయశ్రీ, కోశాధికారి మోహన్ బాబు, హేమాంబరధరరావు, వెంకటకృష్ణ, సూర్య ప్రకాష్, శ్రీనివాసులు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శనివారం మహిళ విద్యా – సమాజ అభివృద్ధి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీకాళహస్తి ప్రభుత్వం మహిళా డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ సదస్సులో డీఎస్పీ కెవెన్ మూర్తి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తి వేసిన 'సమతా' సంచికను విడుదల చేశారు.

ప్రజాశక్తి - కేవీబి పురం: కెవిబి పురం మండలంలోని కొత్తూరు, ఎగువపూడి, వడ్డీ కండ్రిగ గ్రామాలలో మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ అన్ని రంగాలలో మహిళలకు సమాన హక్కులు అవకాశాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ కె.వి.బి పురం మండలం ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు, అంగన్వాడి యూనియన్ నాయకురాలు రాజేశ్వరి, శకుంతల, సుబ్బమ్మ, సత్తమ్మ, కమలమ్మ, బుజ్జమ్మ, వెంకటమ్మ, దేశమ్మ, కళావతి, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పిచ్చా టూరు: శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పిచ్చాటూరు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డీ ఇలంగోవన్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పద్దు రాజు, వాసు రెడ్డి, దొరవేల్ రెడ్డి, చిన్నా, ఢిల్లీ బాబు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రజా ప్రగతి ట్రస్ట్, చెంచులక్ష్మి మ్యాక్స్‌ల ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బుచ్చినాయుడు కండ్రిగ సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ పుష్పలత, విద్యాశాఖ నుండి జయశ్రీ, ప్రజాప్రగతి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు, చెంచులక్ష్మి మ్యాక్స్ అధ్యక్షురాలు అనితాలక్ష్మీ, మహిళా సంఘం సభ్యులు మరియు అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజా ప్రగతి ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఉత్తమ సర్పంచిగా ఇటీవల కేంద్ర ప్రభుత్వ అవార్డు అందుకున్న చెర్లోపల్లి సర్పంచ్ సుభాషిణిని మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం ఘన సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మండల టిడిపి అధ్యక్షులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, టీటీడీ కాంట్రాక్టర్ శుభగిరి నాయుడు టిడిపి నాయకులు గౌస్ బాషా, శేషరెడ్డి, వాసుదేవనాయుడు, కోటేశ్వర నాయుడు, యమనిబాబు, లోకేశ్వరనాయుడు, పంచాయతీ కార్యదర్శి సుజాతలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -దొరవారిసత్రం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం తెలుగు ప్రాజెక్ట్ సిబ్బందికి పలు రకాల క్రీడల పోటీలు నిర్వహించి బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సిసి ఉషారాణి, వివోఏ లావణ్యలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీసీ,వివో ఏ, పొదుపు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : కస్తూరుబా గాంధీ కేంద్ర ట్రస్ట్, శిల్పారామం వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకొని పలువురు మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ కేంద్ర టెస్ట్ చైర్మన్ డాక్టర్ పి సి రాయల్ మాట్లాడుతూ మహిళలు తల్లిగా చెల్లిగా భారీగా చక్కటి పాత్రను పోషిస్తున్నారని, ఇల్లాలే ఇంటికి వెలుగని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఎల్ నాయుడు, వివి రమణ, విజయ్ కుమార్, స్వర్ణలత, ఉమాపతి, బండి మధుసూదన్ రెడ్డి, వాకర్స్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వవిద్యాలయంలోని ప్రముఖ చెలికాని అన్నారావు సభాభవనంలో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత శుక్ల, కో–ఆర్డినేటర్ ప్రొ.ఆర్.దీప్త, అడిషనల్ కొ–ఆర్డినేటర్స్ డా.ఎస్.వైష్ణవి, డా.జి.నాగలక్ష్మి, డా.బుల్టీదాస్, విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: మండలంలోని కళ్యాణపురం దగ్గర, హెరిటేజ్ పాల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పాడి రైతులు, పాల సేకరణ ప్రతినిధులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణపురం డైరీ మేనేజర్ శేఖర్, సూపర్వైజర్ అనిల్ కుమార్ , డైరీ సిబ్బంది,శ్రీవిద్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీమతి రేవతి ఉమామహేశ్వర్, మహిళ పాడి రైతులు ,పాల సేకరణ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): శనివారం మండలంలోని పనపాకం గ్రామంలో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని మహిళా నేత పులివర్తి సుధారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, మహిళలు, కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్చి 8 అంటే వేడుకలు, ఉత్సవాలేనా?

ప్రజాశక్తి - క్యాంపస్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పిడిఎస్ఓ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తిరుపతి నర్సింగ్ కాలేజీలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రొ.తులసి, పిడిఎస్ఓ తిరుపతి జిల్లా కార్యదర్శి ఆర్.ఆశ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపిజిఈఏ) మహిళా విభాగం ఆధ్వర్యంలో రాస్ భవనంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ గాలి పుష్పలత, సెక్రటరీ నాగమణి, డిపిఎం మాధవి, మల్లీశ్వరి, సుబ్బరాయుడు, చిట్టెమ్మ, రేవతి, సుధారాణి, శ్రీనివాసులు, ఉమా, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం, విభాగాల ఆధ్వర్యంలో, వే ఫౌండేషన్ సహకారంతో శనివారం సావేరి సెమినార్ హాల్లో మార్చి 8, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన్నూరు సుగుణమ్మ, టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి, స్విమ్స్ కార్డియాలజిస్ట్ ప్రొఫెసర్ వి.వనజాక్షమ్మ, ఇన్చార్జి డీన్, ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి, మాజీ విసి ఆచార్య దుర్గాభవాని, ఇన్చార్జి రిజిస్ట్రార్ డా. గీతావాణి, వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు పైడి అంకయ్య, మహిళా అధ్యయనశాఖ ఇన్చార్జి హెడ్ డా. నీరజ, సిబ్బంది, విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థునులు పాల్గొన్నారు.

న్యాయవాదికి అవార్డు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు సీనియర్ న్యాయవాది దాచే పల్లి వెంకటేశ్వరరావు బ్యాంకులకు ఋణ గ్రహీతలు కట్టవలసిన బాకీలు, రాబట్టు నిమిత్తం గూడూరులో నేషనల్ లోక్ అదాలత్‌లో గత కొన్ని సంవత్సరాలుగా బ్యాంకులకు సేవలు అందిస్తున్నారు. లోకదాలత్ బెంచ్ కి, బ్యాంకులకు వారధిగా వ్యవహరిస్తూ చాలా కేసులను పరిష్కరించారు. అయన సేవలను గుర్తించి ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం నేషనల్ లోక్ అదాలత్, ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయ వాది వెంకటేశ్వరరావుకి అవార్డును అందజేయడం జరిగింది.

గ్రామాల్లో 'బెల్ట్' కిక్కు



ప్రజాశక్తి - ఓజిలి: ప్రభుత్వ మద్యం దుకాణాలు పోయి ప్రైవేటు మద్యం దుకాణాలు వచ్చాయి. కావాల్సిన బ్రాండ్లు కొనుక్కోవచ్చు. తాగొచ్చు. అయితే ఎక్కడో ఉన్న మద్యం దుకాణాలకు వెళ్లి కొనుక్కునేందుకు ఇబ్బంది పడకుండా అందుబాటులో కూడా మద్యం దొరికే సౌలభ్యం ఓజిలి మండలంలోని ప్రతి గ్రామంలో ఉంది. బెల్టుషాపులు యథేచ్ఛగా నడుస్తున్నాయి.

పల్లెల్లో ఎక్కడ చూసినా బెల్టు షాపుల కిక్కు జోరుగా కనిపిస్తోంది. గ్రామానికి ఒక బెల్టు షాపు చొప్పున పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. గ్రామాల్లో బెల్ట్ షాపుల కారణంగా పచ్చని సంసారంలో చిచ్చు పెడుతుందని, అంతే కాకుండా వయసుతో సంబంధం లేకుండా యువత మద్యానికి బానిస అవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. తనిఖీలు నిర్వహించాల్సిన సంబంధిత అధికారులు ముడుపులు తీసుకుని మౌనంగా ఉంటున్నారని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మద్యం బెల్ట్ షాపుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా జోరుగా సాగుతున్నాయి. అనుమతులు లేకుండా మద్యం దుకాణాల వద్ద వెలసి ఉన్న కూల్ డ్రింక్ షాపుల్లో విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ మద్యం మత్తులో దుకాణాల వద్దనే వివాదాలకు నిలయంగా మారుతున్నా అధికారులు పట్టించుకున్న పాపానికి పోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఒక్కొక్క బెల్టు షాపు నుంచి కొంతమంది అవినీతి అధికారులకు భారీగా ముడుపులు ఇస్తున్నట్లు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారనే సమాచారం తెలిపినా తూతూ మంత్రంగా తనిఖీలు చేపడుతూ అధికారులు చేతులు దులుపు కుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే మరోవైపు బెల్ట్ షాపుల నిర్వాహకులు క్వార్టర్‌పై రూ.30 నుంచి రూ.50, బీర్ల పై రూ. 40 నుంచి రూ. 60 వరకు అధికంగా వసూలు చేస్తూ దండుకుంటున్నారని మద్యం ప్రియులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు బెల్టు దుకాణాల నిర్వహణ పై ప్రత్యేక దష్టి సారించి పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్టు షాపుల పై కఠిన చర్యలు తీసుకోవాలని యువత, ప్రజలు మద్యానికి బానిస కాకుండా అరికట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

వైన్ షాప్ బ్యానర్లు దగ్ధం



తిరుపతి సిటి : మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు సాయినగర్‌లో నివాస ప్రాంతాల మధ్య ఉన్న వైన్‌షాపు షట్టర్ మూసివేసి, బ్యానర్‌ను చించివేశారు. బైరాగిపట్టెడ కార్యాలయం నుంచి ప్రదర్శనగా వెళ్లిన మహిళలు స్థానికంగా వైన్‌షాపును వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసి శనివారం నిరసన తెలిపారు. నివాసాలు, బ్యాంకులు, విద్యార్థుల హాస్టళ్లు, ఆస్పత్రి మధ్య ఏర్పాటు చేసిన దుకాణాన్ని ఎత్తివేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర నాయకురాలు నదియా, మంజుల, రత్నమ్మ, ప్రమీల, లక్ష్మి, విజయ, అవనాక్షి, కవిత, అలివేలు పాల్గొన్నారు.

భూముల రక్షణకు స్వమిత్వ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : భూముల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వామిత్వ కార్యక్రమం చేపట్టిందని డి.ఎల్.పి.వో వెంకట రమణ తెలిపారు. శనివారం గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో గూడూరు డివిజన్ పరిధిలోని 8 మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లకు స్వామిత్వ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తులపై స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించుటకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఈవో పి అర్డి మోహన్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు , ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ రవాణాపై నిఘా

ప్రజాశక్తి - రామచంద్రాపురం: మండలంలో అక్రమ గ్రావెల్ రవాణాపై ప్రత్యేక నిఘా టీం విస్తృతంగా తనిఖీలు చేసి పూర్తిగా అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు. శనివారం మండలంలోని అనుపల్లి, నెత్తకుప్పం, పిల్లారి కోన, సత్రంమిట్ట, బొప్పరాజు పల్లి, ఎల్‌వి పురం, రాయల చెరువు, కుప్పం బాదూరు, కమ్మపల్లి, సి.రామాపురం, పరమాల, కొత్త కండ్రిగ గ్రామాలలో టీం సభ్యులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సి రామాపురంలో అక్రమంగా గ్రావెల్ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు సీజ్ చేసి పోలీసులకు స్వాధీనం చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రావెల్ క్వారీ అనుమతులు లేకుండా, ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వినా అక్రమ రవాణా చేసినా వాహనాలను సీజ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుణ భూషణ్ నాయుడు, నరసింహులు, వెంకటరమణ, బాబు, ప్రదీప్ నాయుడు, పోలీస్ హెడ్ కానిస్టేబులు ఓబుల్ రెడ్డి, యోబు. వీఆర్‌ఏలు గీత, సుబ్రహ్మణ్యం, బాల, తదితరులు పాల్గొన్నారు.

అడవిలోకి చొరబడుతున్న 8 మంది అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలంలోని అటవీ సరిహద్దు ప్రాతంలోకి చొరబడుతున్న 8 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్సు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ ఐ సాయి గిరిధర్ ఆధీనంలోని ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బృందం శ్రీకాళహస్తి ఏర్పేడు మండలంలో కూంబింగ్ చేపట్టారన్నారని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. స్థానిక అటవీశాఖ అధికారులు ఎఫ్ఆర్ఓ లోకేష్, ఎఫ్ బి ఓ పురుషోత్తం రెడ్డెప్పల సహాయంతో పాపా నాయుడుపేట బత్తినయ్య కాలనీ వైపు కూమింగ్ నిర్వహిస్తుండగా ఆ ప్రదేశంలో ఒక వాహనం ఆగి ఉందన్నారు. వాహనంలోని వ్యక్తులు టాస్క్ ఫోర్స్ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారని, వారిని వెంబడించి 8 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరంతా తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించామని, కారు డ్రైవర్ ఆంధ్రకు చెందిన వ్యక్తిగా ఉన్నారన్నారు. వీరిని అరెస్టు చేసి తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో ఎస్పై రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విద్యార్థుల కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, గట్టు గ్రామస్తులు ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు రవితేజ, ముని కుమార్‌లు శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టిడిపి నాయకులు, గట్టు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నాలుగు ట్రాక్టర్లు, ఒక జెసిబి సీజ్

ప్రజాశక్తి - పిచ్చాటూరు: తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, నారాయణవనం మండలం, భీముని చెరువు గ్రామానికి చెందిన గుట్టలో ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. భీముని చెరువు గుట్ట సమీపంలో పుత్తూరుకు చెందిన శేషాచల కాలేజీ చైర్మన్ వెంకటసుబ్బయ్య భూములను కొన్నారు. ఆయన భూములను ఆనుకొని భీముని చెరువు గుట్ట ఉంది. ఈ గుట్ట నుంచి ప్రతిరోజు కళాశాల చైర్మన్ వెంకటసుబ్బయ్య జెసిబిలు ట్రాక్టర్ల ద్వారా ఎర్రమట్టిని ఇటుక తయారుదారులకు తరలిస్తున్నారు. గుట్ట చుట్టూ కంచె వేయడంతో జీవాల మేతకు కష్టమవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యం చేసి ఈ భూములంతా తమదేనంటూ చెప్పుకొస్తున్నారు. ఆయన భూములకు పక్కనే ఉన్న డీకేటి భూములను కూడా ఆక్రమించుకున్నందున, వర్షం కురిస్తే నీళ్లు కూడా కాలువల ద్వారా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామ ప్రజల సమాచారం ఇవ్వడంతో నారాయణవనం ఎస్సై రాజశేఖర్, నాలుగు ట్రాక్టర్లను ఒక జెసిబిని పోలీస్ స్టేషన్‌కి తరలించి కేసు నమోదు చేశారు. రెవెన్యూ, పోలీసు, మైన్స్ అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బొజ్జలపై నిందలేస్తే యుద్ధం తప్పదు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిపై నిందలేస్తే యుద్ధం తప్పదని టీడీపీ నేతలు హెచ్చరించారు. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ పలువురు టీడీపీ నాయకులు శనివారం స్థానిక ఎన్టీఆర్ భవన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. నీతీ, నిజాయితీకి బొజ్జల కుటుంబం మారు పేరు అన్నారు. ఎస్సీవీ నాయుడి చీకటి పాలన నియోజకవర్గ ప్రజలందరికీ ఎరుకన్నారు. ఓటేరు చెరువును కాపాడాలని బొజ్జలకు రైతులు ఫిర్యాదు చేయడం వల్లనే ఆయన అసెంబ్లీలో ప్రస్తావించారని అన్నారు. అక్కడ ఎవరిపేర్లు చెప్పకపోయినా గుమ్మడికాయల దొంగ ఎవరు అంటే నేనే.. నేనే అంటూ ఎస్సీవీ భుజాలు తడుముకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఎస్సీవీ పేజీల పుస్తకం విప్పితే ఆయన అడ్రస్సు గల్లంతు అవుతుందని స్పష్టం చేశారు. విజయ్ కుమార్ నాయుడు, రావిళ్ల మునిరాజా నాయుడు, రంగినేని చెంచయ్య నాయుడు, గాలి చలపతి నాయుడు, కామేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సహస్రలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శారద

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం రవాణా శాఖ కూడలిలోని సహస్ర హాస్పిటల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు హాస్పిటల్ ఎండి డాక్టర్ శబరిష్ వూకా తెలిపారు. రెండు రోజులు పాటు జరిగే ఈ ఉచిత వైద్య శిబిరంలో శనివారం మొదటి రోజు 55 మందికి మధుమేహం, రక్తపోటు, హిమోగ్లోబిన్ శాతం పరీక్షలను నిర్వహించామన్నారు. పెద్దలకే కాకుండా పిల్లలకు కూడా ఈ వైద్య శిబిరంలో సేవలు అందించామన్నారు. ఆదివారంతో ఈ శిబిరం ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ శారద, పీడియాట్రిషన్ త్రిసాలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భారతీయ జానపద, గిరిజన సంప్రదాయాలపై జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎన్ఎస్యు, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాయలంలో " పురాణాలు, భారతీయ జానపద, గిరిజన సంప్రదాయాలపై" జాతీయ సదస్సును పొసిల్స్, వర్సిటీలోని ప్రొ.రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్నడ డెవలెప్మెంట్ అథారిటీ, కర్ణాటక ప్రొ.పురుషోత్తం బిలిమలే విచ్చేసి భారతీయ జానపద సాహిత్యం గొప్పతనాన్ని వివరించారు. అంతరించిపోతున్న జానపదసాహిత్యాన్ని మనం అందరం సంరక్షించాలని సూచించారు. పొసిల్స్ ప్రెసిడెంట్ కన్నడ విశ్వవిద్యాలయం పూర్వ కులపతి ప్రొ. హెచ్.సి బోరలింగయ్య మాట్లాడుతూ ఈ సదస్సు ఆవశ్యకతను, ఆధునిక భారతంలో జానపదసాహిత్య గొప్పతనాన్ని వివరించారు. భారతదేశంలో ప్రత్యేకించి గిరిజన సాహిత్యంపై మరింత ప్రచారం చెయ్యాలని సూచించారు. సమ్మానన అతిథి రాష్ట్రపతి పురస్కార గ్రహీత సాహిత్య శాస్త్ర నిష్ణాతులు ప్రొ.కె.రామ సూర్యనారాయణ మాట్లాడుతూ భారతీయ జానపద సాహిత్యం ఆకాలం నాటి సామాజిక ఉత్తేజానికి కారణమని వివరించారు. ప్రతి ఒక్కరూ కూడా గిరిజన సాహిత్యాన్ని, ప్రాచీన పురాణ వ్మాయాన్ని అధ్యయనం చెయ్యాలని సూచించారు. కుంచికా భాషణం కాలికట్ యూనివర్సిటీ జానపదసాహిత్య విభాగ ప్రొఫెసర్ రాఘవన్ పయ్యానాడ్ మాట్లాడూతూ ఆధునిక తరానికి జానపదసాహిత్యం,



గిరిజన సాహిత్యం, పురాణ సాహిత్యంపై భోధించవలసిన అవసరాన్ని ప్రత్యేకించి వర్ణించారు. ప్రతి ఒక్కరూ కూడా ఈ సాహిత్యాలను అధ్యయనం చెయ్యడం వలన మరిన్ని కొత్త ఒరవడులను తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొసిల్ల్ సంస్థ గొప్పతనాన్ని, చేస్తున్న సాహిత్య కృషిని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పోక్లోర్ ప్రొ.ఎన్.భక్తవత్సల రెడ్డి వివరించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ జానపద సాహత్యం సంరక్షణే ఈ సంస్థ ముఖ్యోద్దేశ్యమని వివరించారు. ప్రతి ఒక్కరూ పాచీన సాహిత్యంపై మక్కువను పెంచుకోవాలని వివరించారు. సభాధ్యక్షులు విశ్వవిద్యాలయం విసి ప్రొ.జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తి మాట్లాడుతూ ఈ మూడు రోజుల సాహిత్య సదస్సు ద్వారా ప్రత్యేకించి భారతీయ జానపద సాహిత్యం, గిరిజన సాహిత్యం, పురాణ సాహిత్యాలను అధ్యయనం చెయ్యాలని సూచించారు. ఈ అధ్యయనం ద్వారా మరిన్ని గొప్ప గొప్ప విషయాలను ఆధునిక యువతరం తెలుసుకోవడం సాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంయోజకులు, తెలుగుశాఖాధ్యక్షులు డా.డి.నల్లన్న, పొసిల్స్ వైస్-ప్రెసిడెంట్ ప్రొ.బి.కృష్ణారెడ్డి, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై ఊరేగిన కళ్యాణ వెంకన్న



ప్రజాశక్తి రామచంద్రపురం (చంద్రగిరి) శ్రీనివాసమంగాపురం శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో లక్ష్మి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకన్న బంగారు తిరుచ్చి వాహనంలో విహరిస్తూ మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సేవలో టెంపుల్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ పి. వరలక్ష్మి, ఏ ఈ ఓ యమ్ గోపీనాథ్, టెంపుల్ సూపరింటెండెంట్ రాజ కుమార్, ఆర్జితం ఇన్స్పెక్టర్ ఆర్జితం ఇనస్పెక్టర్ అనంబట్టు ధన శేఖర్, అర్చకులు : కె ఆర్ ఆంజనేయ చార్యులు స్వామీ, రవి చంద్రన్, అధ్యాపక, ఘనాపాటి తిరువెంగాడం స్వామీ పరిచారిక , టెంపుల్ జమేదర్ మంకు చిరంజీవి, భక్తులు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సేవలకు విశిష్ట పురస్కారం



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చి నాయుడు కండ్రిగ మండలం, తలారివెట్టు పంచాయతీ కామన్ సర్వీస్ సెంటర్‌లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న పక్యాల విక్రమ్‌కు జిల్లా బెస్ట్ విలేజ్ లెవల్ ఎంటర్ పెన్యూర్‌గా ప్రోత్సాహక అవార్డు లభించింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ యశ్వంత్, తిరుపతి జిల్లా మేనేజర్ సతీష్‌లు పాల్గొని విక్రమ్‌కు అభినందనలు తెలిపారు.

అలిపిరి పోలీసుల పల్లె నిద్ర

ప్రజాశక్తి - తిరుపతి సిటీ :తిరుపతి అర్బన్, అలిపిరి పరిధి, శెట్టిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి అలిపిరి పోలీస్ స్టేషన్ ఎస్.ఐ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువతకు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అలిపిరి పోలీస్‌లు హరినాథ్, నాగయ్య, గ్రామస్తులు గోపి, బుజ్జి, కృష్ణమూర్తి, ప్రభాకర్, జాని తదితరులు పాల్గొన్నారు.

మెగా కార్పొరేట్ లీగ్ ప్రారంభం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి తారకరామా పెవిలియన్ స్టేడియంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు ముఖ్య అతిథులుగా విచ్చేసి మెగా కార్పొరేట్ క్రికెట్ లీగ్ టీ - 20 టోర్నమెంట్ శనివారం ప్రారంభించారు. చీర్ల కిరణ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నమెంటులో పది టీములు పాల్గొనున్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మంచి స్పోర్ట్స్ స్పిరిట్‌తో గేమ్ ఆడాలన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్నేహ పూర్వకంగా గేమ్ ఆడాలని సూచించారు. నిర్వాహకులు చీర్ల కిరణ్ మాట్లాడుతూ క్రికెట్లో ఎంపైర్ నిర్ణయాన్ని గౌరవించాలని నెక్స్ ఇయర్ నుంచి మరిన్ని టీములు పెంచుతామని తెలిపినారు. మార్చి 19 ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పిసి రాయల్, జిల్లా క్రీడా అధికారి సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

ఔషధ పరిశోధన రంగంలో విస్తృత అవకాశాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం: ఔషధ పరిశోధనా రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని ట్రినిడాడ్ టొబాగో ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ రాజీవ్ దాహియా అన్నారు. శనివారం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫారసీ కళాశాలలో " ఔషధ రూపకల్పన, ఆవిష్కరణ, అభివృద్ధి మరియు ఔషధ శాస్త్రాలలో ప్రపంచ ధోరణలు" అనే అంశంపై రెండు రోజుల పాట జరిగిన ఇండో-కరేబియన్ అంతర్జాతీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ గౌరవ్ గుప్త, విజయ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పదులత, ప్రిన్సిపాల్ యం. నిరంజన్ బాబు, కళాశాల పరిపాలన డైరెక్టర్, ప్రొఫెసర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, బోధన సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



జనసేన ఆవిర్భావ పోస్టర్ విడుదల



ప్రజాశక్తి - తిరుపతి సిటీ :ఈనెల 14వ తేదీన పీఠాపురంలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవ బహిరంగ సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం తిరుపతి నియోజవర్గ సన్నాహక సమావేశంలో ఛలో పిఠాపురం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి, కార్పోరేటర్లు సికే రేవతి, నారాయణ, నరసింహాచ్చారి,ఎస్ కే బాబు, పొన్నాల చంద్ర, నరేంద్ర, దూది శివ, ఆదం సుధాకర్ రెడ్డి, యాదవకృష్ణ, వెంకటేశ్వర రావు, హరిశంకర్, బాబ్జి, పగడాల మురళీ, జానకిరామ్, ఆకేపాటి సుభాషిణి, కీర్తన, ఆకుల వనజ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ తీర్పు.. అంతిమం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాజీ చేసుకోదగిన అన్ని కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేస్తా మని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాదికార సంస్థ ఛైర్మన్ ఇ భీమా రావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా కోర్టు సమావేశం హాలులో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యంఎస్ భారతి, 1వ అదనపు జిల్లా న్యాయమూర్తి రమేష్, 6 వ అదనపు జిల్లా న్యాయమూర్తి బాబునాయిక్, బార్ అసోషియేషన్ అధ్యక్షులు శంకర్ నాయుడు, డిఎస్పీ సాయినాద్ లతో కలసి జాతీయ లోక్ అదాలత్ ప్రారంభానికి అతిథిగా హాజరయ్యాడు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ లో రాజీ చేసుకోదగిన అన్ని రకాల కేసుల రాజీ చేస్తామన్నారు. సుప్రీంకోర్టు, జాతీయ న్యాయసేవాదికారి సంస్థ, రాష్ట్ర న్యాయసేవాదికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 13 కోర్టుల పరిధిలో 32 బెంచ్ లు ఏర్పాటు చేసిందన్నారు. లోక్ అదాలత్ ఇచ్చిన తీర్పు అంతిమ తీర్పు అనిదాని పై ఆపిల్ కూడా ఉండదన్నారు. లోక్ అదాలత్ లో కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందని, రాజీ మార్గమే రాచ మార్గమని తెలిపా రు. ఈ కార్యక్ర మంలో న్యాయ మూర్తులు, న్యాయ వాదు లు, బ్యాంక్, బీమా, సంస్థల అధికారు లు, కక్షిదారులు,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. **పలమనేరు:** పలమనేరు కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో, బ్యాంకు అధికారులకు, పోలీస్ అధికారులకు రాజీ మార్గంలో సామరస్యంగా ఎక్కువ కేసులను పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశం లో జూనియర్ సివిల్ జడ్జి లిఖిత , చిత్తూరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఉమా దేవి, బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ లక్ష్మీపతి , సీనియర్ , జూనియర్ న్యాయవాదులు, బ్యాంకు అధికారులు, కోర్టు సిబ్బంది, కాక్షిదారులు పాల్గొన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో మొత్తం 428 కేసులు పరిష్కరించారు. ఇందులో సివిల్ కేసులు 12, క్రిమినల్ కేసులు 393, బ్యాంకు రికవరీ కేసులు 23 కేసులు పరిష్కరించారు.

కుప్పం రూరల్: రాజీయే రాజమార్గమని, న్యాయ స్థానాలలో కేసులు పెట్టుకొని అనవసరంగా సమయాన్ని, ధనాన్ని వృథాచేసుకోరాదని అడిషనల్ సివిల్ జడ్జ వరుణ్ తేజ్ తెలిపారు. శనివారం కుప్పం న్యాయస్థానం నందు జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన నిర్వహించారు. ఇందులో మొత్తం 268 కేసులు రాజీ కుదిర్చినట్టు తెలిపారు. ఇందులో సివిల్ కేసులు 8 ఉండగా, క్రిమినల్ కేసులు మాత్రమే 260 కేసులు రాజీ అయినట్టు తెలిపారు. న్యాయస్థానాలలో కేసులు పెట్టుకున్న కక్షిదారులు రాజీ కుదుర్చుకోవడం వల్ల వారి సమయంతో పాటు ధనం ఆదా అవుతుందని, కక్షిదారులు లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకొని కేసులను రాజీ కుదుర్చు కోవడం వల్ల ఇరు వర్గాలు విజయం సాధించినట్లు అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ చంద్రప్ప, న్యాయవాదులు, పోలీసు శాఖ, న్యాయస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ సాధికారికతకు చర్యలు తీసుకోవాలి



ప్రజాశక్తి - రామచంద్రాపురం: మహిళా సాధికారికతకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని చిత్తూరు జిల్లా బిజెపి కార్యదర్శి కాయం హరినాథ్ రెడ్డి రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు పురందేశ్వరిని కోరారు. రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి చిత్తూరు జిల్లా పర్యటనను ముగించుకుని తిరుగు ప్రయాణంలో శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షులు బి.చంద్రారెడ్డి నివాసానికి విచ్చేసారు. ఈ సందర్భంగా,బీజేపీ జిల్లా కార్యదర్శి హరినాథరెడ్డి రెడ్డి మర్యాదపూర్వకంగా అధ్యక్షురాలిని కలిసి ఘనంగా సన్మానం చేసారు.ఆమెకు మహిళాదినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చి, మహిళలకు రాజకీయ రంగంలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. మహిళలలో ఆర్థిక సౌలంబన కల్పించటానకి బిజెపి అమలు చేస్తున్న పథకాలను కింది స్థాయి వరకు చేరటానికి ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ బలోపేతానికి అందరు సహకారంతో ముందుకు సాగుతున్నామన్నారు. అట్టడుగు స్థాయి వరకు పార్టీని విస్తరింప చేయటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పురందేశ్వరి కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తున్న సహాయ సహకారాలను ఆమె వారికి వివరించారు.ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు కూడా పాల్గొన్నారు.